క్లుప్తంగా

ఎమ్మెల్యేను కలిసిన ఆలయ కమిటీ



ఎమ్మెల్యేకు బొకే అందిస్తున్న ఆలయ కమిటీ

వేములవాడఅర్బన్: బోయినపల్లి మండలం కేంద్రంలోని సీతారామచంద్రస్వామి దేవస్థానం అభివృద్ధి కోసం ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ టీటీడీ ద్వారా రూ.10 లక్షలు మంజూరు చేయించినందుకు ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్, సభ్యులు ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌ను కలిశారు. ఇటీవల నియామకమైన ఆలయ కమిటీని ఎమ్మెల్యే శాలువలతో సన్మానించారు. కార్యక్రమంలో చైర్మన్ బొజ్జ ప్రభాకర్, బోయిని రాజు, ఎల్లేశ్, శేఖర్, గుంటి శంకర్, వాసాల శ్రీనివాస్, అనిల్ కుమార్, గంగధర్, తిరుపతి పాల్గొన్నారు.

ఓటరు నమోదుకు స్పందన



ఓటరు నమోదుకు దరఖాస్తులు ఇస్తున్న సిబ్బంది

ముస్తాబాద్: మండలంలో ఓటరు నమోదు, సవరణలకు చేపట్టిన స్పెషల్ డ్రైవ్ ఆదివారం ముగిసింది. ఫారం-06 ద్వారా 18 ఏళ్లు పూర్తిచేసుకున్న యువత ఓటర్లుగా నమోదు చేసుకున్నారని తహసీల్దార్ గణేశ్ తెలిపారు. మండలంలోని 46 పోలింగ్ కేంద్రాలలో శని, ఆదివారాల్లో స్పెషల్ డ్రైవ్ చేపట్టామని, బీఎల్‌వోలకు 710 మంది వ్యక్తిగతంగా దరఖాస్తులు చేసుకోగా, మరో 105 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్నారన్నారు. అలాగే ఫారం -08 ద్వారా ఓటరు జాబితాలో పేర్ల సవరణలు తీసుకోవడం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరు బాధ్యతయుతంగా ఓటరు నమోదుకు ముందుకు రావాలన్నారు.

కుల సంఘాల బలోపేతానికి కృషి చేయాలి



కిషన్‌ను సన్మానిస్తున్న గోవర్ధన్‌గౌడ్

ఎల్లారెడ్డిపేట: జిల్లాలో కుల సంఘాల బలోపేతానికి నూతన కమిటీలు దోహదం చేస్తాయని, అందరూ సమష్టిగా సంఘాల బలోపేతానికి కృషి చేయాలని జిల్లా గౌడ సంక్షేమ సంఘం అధ్యక్షుడు చిదుగు గోవర్ధన్‌గౌడ్ అన్నారు. మండలంలోని రాచర్లబొప్పాపూర్‌లోని ముదిరాజ్ సంఘం పెద్దమనిషిగా ఎంపికైన నా నిమ్మల కిషన్‌ను ఆదివారం సన్మానించి మాట్లాడారు. గ్రామాల్లో అన్ని సంఘాలు కార్యవర్గాలను ఏర్పాటు చేసుకొని తమ సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. మంత్రి కేటీఆర్‌తో మాట్లాడి కుల సంఘ భవనాలకు నిధులు మంజూరు చేయాలని కోరుతామన్నారు. కుల బాంధవుల్లో ఎవరికీ ఏ ఆపద వచ్చిన ముందుండాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొండపురం బాల్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ బొమ్మనవేణి సత్యం, నాయకులు పాల్గొన్నారు.

భారీ వర్షం.. స్తంభించిన జనజీవనం

- మత్తడి దూకుతున్న చెరువులు
- పొంగుతున్న వాగులు
- మూలవాగులో పెరిగిన ప్రవాహం
- రవాణా వ్యవస్థకు ఆటంకం



వేములవాడరూరల్: వర్షపు నీటితో పారుతున్న నక్కవాగు



వేములవాడఅర్బన్: ఉధృతంగా పారుతున్న వరద నీరు

వేములవాడ: ఆదివారం ఉదయం నుంచి కురుస్తున్న భారీ వర్షానికి మూలవాగు ప్రవాహం ఒక్కసారిగా పెరిగింది. దీంతో జనం పెద్ద ఎత్తున మూలవాగు ఒడ్డుకు చేరుకుని కొత్తనీటి ప్రవాహాన్ని తిలకించారు.

వేములవాడరూరల్: మండలంలోని హన్మాజిపేట వద్ద ఉన్న నక్కవాగు ఆదివారం కురిసిన వర్షంతో మళ్లీ పారుతున్నది. దీంతో మధ్యాహ్నం నుంచి గ్రామాలకు వెళ్లే ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. బ్రిడ్జి నిర్మాణం కోసం ప్రభుత్వం మంజూరు చేసినప్పటికీ ఇంకా పనులు ప్రారంభం కాలేదు. బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే తప్ప, ఈ ప్రాంత వాసులకు ఈ కష్టాలు తప్పవంటున్నారు.

పారుతున్న కాల్వలు

వేములవాడఅర్బన్: బోయినపల్లి మండల కేంద్రంలో ఆదివారం ఉదయం నుంచి కురుస్తున్న వర్షానికి బోయినపల్లి నుంచి వేములవాడ-బూర్గుపల్లి రహదారి, బోయినపల్లి-కోదురుపాక వెళ్లె రహదారిలో కల్వర్టుల మీదుగా వరద నీరు ప్రవాహించడంతో వాహనదారులకు ప్రమాదకరంగా మారింది. దాంతో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు.

అత్యధిక వర్షపాతం నమోదు

కోనరావుపేట: మండలంలోని గ్రామాల్లో ఆదివారం కురిసిన భారీ వర్షానికి అతలాకుతలమయింది. కోనరావుపేటలో ఆదివారం 54.6 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. కొద్ది రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు పలు గ్రామాల్లో రవాణా వ్యవస్థలు దెబ్బతిన్నాయి. మూలవాగుపై నిర్మించిన కాజ్‌వేలు కొట్టుకుపోవడంతో తాత్కాలిక మరమ్మతులు చేపట్టినా అవి మళ్లీ కొట్టుకుపోయాయి.

దంచికొట్టిన వాన

ఎల్లారెడ్డిపేట: మండలంలోని ఆయా గ్రామాల్లో ఆదివారం ఉదయం నుంచి వర్షం దంచికొట్టింది. ఉదయం నుంచి రాత్రి వరకు ఎడతెరపి లేకుండా కురిసిన వర్షంతో గ్రామాల్లో వాగులు పొంగిపొర్లాయి. ఈ వర్షంతో అన్నదాతలు ఊపిరిపీల్చుకున్నారు. ఇటీవల వర్షాలు లేక సాగుచేసిన పత్తి పంటలకు సాగునీరు అందక ఎండిపోయే పరిస్థితుల్లో ఈ వర్షం రైతులకు ఊరటనిచ్చింది. ఎల్లారెడ్డిపేట, రాచర్లగొల్లపల్లి, వెంకటాపూర్, దుమాల గ్రామాల్లోని కొన్ని కాలనీలు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మండలంలోని మానేరువాగు, చిట్టివాగు, లేతమామిండ్లవాగు, పాలేటివాగుతో పాటు చిన్నచిన్న ఒర్రెలు వరద నీటితో పారుతున్నాయి. ఎగువ ప్రాంతం నుంచి వరద నీరు చెరువుల్లోకి వచ్చి చేరుతుంది. ఉదయం నుంచి కురుస్తున్న వర్షానికి ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరారు.

దెబ్బతిన్న రవాణా వ్యవస్థ

మండలంలో ఆదివారం కురిసిన భారీ వర్షానికి పలు గ్రామాల మధ్య రవాణా వ్యవస్థ దెబ్బతింది. మండలంలోని మామిడిపల్లి-నిజామాబాద్, వెంకట్రావుపేట-బావుసాయిపేట, వట్టిమల్ల-నిమ్మపల్లి గ్రామాల మధ్య మూలవాగుపై ఉన్న వంతెనలు కొట్టుకుపోవడంతో రవాణా వ్యవస్థ స్తంభించిపోయింది.

తాతమ్మ వాగుకు బుంగ

రుద్రంగి: మండలంలో ఆదివారం భారీ వర్షం కురిసింది. ఇప్పటికే పూర్తిస్థాయిలో నిండి ఉన్న చెరువులు ఈ వర్షానికి అలుగు దూకుతున్నాయి. చెరువులు అలుగు దూకడంతో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. పంట పొలాలు, చేలల్లో వరద నీరు చేరడంతో పంట పొలాలు, చేలు నీట మునిగాయి. పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మానాలలో చెరువు అలుగు పక్కన బుంగ పడడంతో చెరువులో నుంచి వరద నీరు భారీగా బయటికి వస్తూ తాతమ్మ వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో మధ్యాహ్నం వరకు రుద్రంగికి మానాలకు రాకపోకలు నిలిచిపోయాయి.



రుద్రంగి: మానాలలో ఉధృతంగా ప్రవహిస్తున్న తాతమ్మ వాగు



నిమ్మపల్లిలో అలుగు దాటి ప్రవహిస్తున్న మూలవాగు



ఎల్లారెడ్డిపేటలో ఏకధాటిగా కురుస్తున్న వర్షం

పార్టీలకతీతంగా హిందూ సాంస్కృతిక సమితి

- హిందూ సాంస్కృతిక సమితి అధ్యక్షుడు పత్తిపాక సురేశ్



మాట్లాడుతున్న సురేశ్

సిరిసిల్లఅర్బన్: రాజకీయ పార్టీలకు అతీతంగా హిందూ సాంస్కృతిక సమితి పనిచేస్తుందని అధ్యక్షుడు పత్తిపాక సురేశ్ అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నూలు పౌర్ణమి సందర్భంగా పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలకు సంబంధించి హిందూ సాంస్కృతి సమితికి పద్మశాలి సంఘం బాధ్యతలను అప్పగించిందన్నారు. అదే నిబద్ధతతో కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేశామన్నారు. కానీ బీఆర్ఎస్ నాయకుడు దిడ్డి రాజు అనే వ్యక్తి హిందూ సాంస్కృతిక సమితిని ఉద్దేశించి ఆరోపణలు చేయడం సరికాదన్నారు. హిందూ సాంస్కృతిక సమితి ఎలాంటి రాజకీయ పార్టీలకు సంబంధం లేకుండా పనిచేస్తుందన్నారు. సదురు బీఆర్ఎస్ నాయకుడు చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సమితి సభ్యులు కూరపాటి శ్రీధర్, రవితేజ, జక్కన్న, సుధాకర్, శంకర్, శ్రీకాంత్, క్రాంతి, నరేశ్ పాల్గొన్నారు.

గీతా పారాయణం



సన్మానం చేస్తున్న రామాలయ మిత్ర కమిటీ

తంగళ్లపల్లి: స్థానిక రామాలయ మిత్ర కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం సిరిసిల్ల గీతా ప్రచార సమితి అధ్యక్షుడు కోడం నారాయణతో గీతా పారాయణం నిర్వహించి ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగవద్గీత విశ్వవ్యాప్తమైనదని ఏ ఒక్క కులానికి, మతానికి చెందినది కాదని భగవద్గీతను పారాయణం చేయడం వలన మానవులు పునీతులు అవుతారన్నారు. ఎంపీపీ పడిగెల మానస, రామాలయ మిత్ర కమిటీ అధ్యక్షుడు బండి తిరుపతి, పద్మశాలీ సంఘం అధ్యక్షుడు రాపెల్లి ఆనందం, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గజభీంకార్ రాజన్న, గీతా ప్రచార సమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

బిల్లులెప్పుడిస్తరో.?

- పొగబారుతున్న మధ్యాహ్న వంట
- బియ్యం తప్ప అన్నీ మావే



మధ్యాహ్న భోజనం తయారు చేస్తున్న కార్మికులు

వేములవాడరూరల్: మధ్యాహ్న భోజనం పథకంలో పనిచేసే కార్మికులకు కష్టాలు తప్పడం లేదు. ప్రభుత్వం అందించే నెలనెలా వేతనాలు రాక ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం బియ్యం తప్ప ఎలాంటి సరుకులు సరఫరా చేయడం లేదు. కార్మికులే కోడిగుడ్లు, కట్టెలు, కూరగాయలు సొంత డబ్బులతో కొనుగోలు చేసి చిన్నారుల కడుపు నింపుతున్నారు. కానీ కష్టపడిన కార్మికుల కడుపులు మాత్రం నిండడం లేదు. చాలా ఏళ్లుగా వేతనాలు పెంచాలని, నెలనెలా వేతనాలు ఇవ్వాలని వారి డిమాండ్లను ప్రభుత్వం పట్టించుకున్న పాపానపోలేదు.

అన్ని గ్రామాల్లో అదే పరిస్థితి

వేములవాడ రూరల్ మండలంలోని 17 గ్రామాల్లో 26 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 43 మంది కార్మికులు మధ్యాహ్న భోజనం వండిస్తున్నారు. వీరికి ప్రభుత్వం ఇచ్చే గౌరవ వేతనం జూన్ నుంచి ఇప్పటి వరకు ఇవ్వలేదు. పిల్లలకు ఇచ్చే కోడిగుడ్లు డిసెంబర్ నుంచి ఇప్పటి వరకు రాలేదని కార్మికులు తెలిపారు. వారికి వేతనాలు రాక ప్రతిరోజు కార్మికులే సొంత డబ్బులతో అప్పులు చేసి మధ్యాహ్న భోజనం మాత్రం తప్పకుండా పిల్లలకు అందజేస్తున్నారు.

బియ్యం తప్ప అన్నీ మావే



మధ్యాహ్న భోజనం ప్రారంభించిన నాటి నుంచి పనిచేస్తున్నాం. ప్రభుత్వం బియ్యం మాత్రమే సరఫరా చేస్తోంది. మిగిలిన సామగ్రి మొత్తం మేమే తెచ్చుకుంటున్నాం. మాకు నెలనెలా ఇచ్చే గౌరవ వేతనం కూడా సకాలంలో రావడం లేదు. గ్యాస్ సిలిండర్లు లేక కట్టెలు తెచ్చుకొని వంటలు చేస్తున్నాం.

– శారద, కార్మికురాలు, హన్మాజీపేట

బిల్లులు పంపాం



వేములవాడ మండల పరిధిలో పనిచేసే మధ్యాహ్న భోజన కార్మికుల బిల్లులు ప్రభుత్వానికి పంపాం. మూడు నెలల బిల్లులు ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్నాయి.

– బన్నాజీ, ఎంఈవో, వేములవాడ

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



ఉమారాణి

వీర్నపల్లి: మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో ప్రజలు, రైతుల జాగ్రతగా ఉండాలని తహసీల్దార్ ఉమారాణి అన్నారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ రానున్న మూడు రోజులు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న దృష్ట్యా ప్రజలు చాలా జాగ్రాతగా ఉండాలని వర్షం వల్ల ఏమైనా ప్రమాదం జరిగితే తమకు తెలియజేయాలని, ప్రజలు ఎవరు చెరువు, వాగుల వద్దకు వెళ్లరాదని, అలాగే వ్యవసాయ రైతులు పొలాల దగ్గర కరెంటు స్తంభాల దగ్గర జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రాణ, పశు, ఆస్తి నష్టం, చెరువులు నిండి మత్తడి దూకిన సమాచారం ఇవ్వాలని, వర్షం పడుతున్న సమయంలో ఎవరు కూడా చెట్ల కిందకు వెళ్లవద్దని చెట్ల మీద పిడుగులు పడే అవకాశం ఎక్కువ ఉంటుందన్నారు. గ్రామాల్లో రోడ్డు తెగే ప్రమాదం ఉంటే గ్రామాల్లో డెలివరీకి దగ్గర ఉన్న గర్భవతులు ఉంటే ఆశ వర్కర్ల సహాయంతో దగ్గరలో వున్న సివిల్ ఆసుపత్రిలో చేర్పించాలన్నారు. ఇందుకు మండలస్థాయి, గ్రామ స్థాయి ప్రజాప్రతినిధులు, అధికారులు సమాచారం ఇవ్వాలన్నారు.

రైతులకు అందుబాటులో ఉండాలి



ఏఎంసీ చైర్మన్‌ను సన్మానిస్తున్న సభ్యులు

ఎల్లారెడ్డిపేట: వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లు, పాలకవర్గసభ్యులు రైతులకు అందుబాటులో ఉండి ఉత్తమ సేవలు అందించాలని మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు కొండపురం బాల్‌రెడ్డి అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్ ఏఎంసీ చైర్మన్‌గా నూతనంగా ఎన్నికైన ఎలుసాని మోహన్‌కుమార్‌తో పాటు డైరెక్టర్ బొమ్మనవేణి సత్యంను ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా బాల్‌రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో ఏఎంసీల పాత్ర కీలకమన్నారు.రైతులు పంటలను సాగుచేసింది మొదలుకొని పంట చేతికిరావడం, రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసే వరకు పాలకవర్గం బాధ్యతతో పని చేయాలన్నారు. ముఖ్యంగా రైతులకు ఎప్పుడు అందుబాటులో ఉండాలన్నారు. లయన్స్ క్లబ్ జిల్లా కేబినెట్ సభ్యుడు వంగల రవీందర్, నిమ్మల కిషన్, సభ్యులు పాల్గొన్నారు.

పంటలకు ప్రాణం పోసిన వర్షం



కళకళలాడుతున్న పత్తిచేను

ఇల్లంతకుంట: అల్పపీడవ ప్రభావంతో ఆదివారం ఉదయం నుంచి భారీ వర్షం కురుస్తుండటంతో పంటలకు ప్రాణమొచ్చింది. ఎర్రటి ఎండలకు పత్తి, మొక్కజొన్న పంటలు వాడిపోయాయి. ఇల్లంతకుంట మండలంలో ఈ ఖరీఫ్ సీజన్‌లో 25 వేల ఎకరాల్లో వరి, 18 వేల ఎకరాల్లో పత్తి, 5 వేల ఎకరాల్లో మొక్కజొన్న, మరో 5 వేల ఎకరాల్లో కూరగాయలు, కంది ఇతర పంటలను సాగు చేశారు. నెల రోజుల క్రితం భారీ వర్షాలు కురిసి ఒక్కసారిగా నెల రోజుల పాటు చినుకు కూడా పడకపోవడంతో సాగు చేసిన పంటలన్నీ కళ్ల ముందే వడలిపోవడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. మరో నాలుగైదు రోజుల పాటు వర్షాలు లేకపోతే మొక్కజొన్న, పత్తి పంటలు పూర్తిగా ఎండిపోతే దశకు వచ్చేవని, పెట్టిన పెట్టుబడులు మట్టిపాలయ్యేవని రైతులు చెబుతున్నారు.

పంటలకు ప్రాణం

మొక్కజొన్న పైర్లు పీచు దశలో ఉండటంతో వర్షాలు లేకపోవడంతో పంటలన్నీ ఎండిపోతే దశకు చేరుకున్నాయి. ఇక నల్లరేగడి భూముల్లో పత్తి పైర్లు కొంత మేరకు బాగానే ఉన్నప్పటికి ఎర్రనేలల్లో పత్తి పైర్లు మాత్రం ఎదుగుదల లేక చిన్నపాటి మొక్కలుగానే ఉండిపోయాయి. ఇప్పటి వరకు పత్తి పంటలో కలుపు కూడా తీయలేదని రైతులు చెబుతున్నారు. ఈ వర్షంతో పత్తి, మొక్కజొన్న పైర్లకు రసాయన ఎరువులు వేయడంతో పాటు, కలుపు తీసేందుకు చాలా ఉపయోగంగా ఉంటుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ముఖ్య నాయకులను కలుస్తున్న తుల ఉమ

వేములవాడరూరల్: వేములవాడ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థిగా అధిష్టానం ఇప్పటి వరకు ఎవరిని ప్రకటించలేదు. కానీ అభ్యర్థిగా ఆసక్తి చూపుతున్న తుల ఉమ మాత్రం ఇప్పటికీ ప్రతి ఒక్కరిని కలిసి వారి మద్దతు కోరుతున్నారు. మొదటి నుంచి పార్టీ తరుపున పోటీలో ఉంటానని చెప్పుకుంటున్న ఆమె నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో సీనియర్ బీజేపీ నాయకులను కలిసి మద్దతు కోరుతున్నారు. అదే పార్టీ నుంచి ఎర్రం మహేశ్ కూడా అభ్యర్థిగా ఉంటానంటూ పలువురిని కలుస్తూ అభిప్రాయాలు తెలుసుకుంటున్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులు ఖరారు కావడంతో ఇక బీజేపీ అభ్యర్థి మాత్రమే మిగిలి ఉంది. ఆ పార్టీ నుంచి తుల ఉమ, ఎర్రం మహేశ్‌తో పాటు ఇటీవల బీజేపీ పార్టీలో చేరిన చెన్నమనేని వికాస్‌రావు పేర్లు ప్రధానంగా చర్చించుకుంటున్నారు.

కాంగ్రెస్ మాయమాటలు నమ్మి మోసపోవద్దు

ఇల్లంతకుంట: ఎన్నికలు వస్తేనే కాంగ్రెస్ నాయకులు గ్రామాల్లోకి వస్తారని, ఐదేళ్లుగా ప్రజలు గుర్తుకు రాలేదని, ఇప్పుడెందుకు గ్రామాల్లోకి వస్తున్నారని జెడ్పీ వైస్‌చైర్మన్ సిద్దం వేణు అన్నారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పల్లె నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని నర్సక్కపేట, ముస్కాన్‌పేట గ్రామాల్లో బీఆర్ఎస్ బూత్‌స్థాయి ఇన్‌చార్జిల సమావేశంలో మాట్లాడారు. మాయమాటలు, మోసపూరిత హామీలు ఇస్తూ కాంగ్రెస్ నాయకులు ప్రజలను మోసం చేయాలని వస్తున్నారని, మూడోసారి మానకొండూర్ ఎమ్మెల్యేగా రసమయి బాలకిషన్ ఘనవిజయం సాధిస్తారన్నారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జిలు మల్లుగారి రవిందర్‌రెడ్డి, ఉడుతల వెంకటేశం, అనంతరెడ్డి, లక్ష్మి, సర్పంచులు స్వామి, శిరీష ఎంపీటీసీలు వనజ, అశ్విని పాల్గొన్నారు.

దళిత యువకులపై దాడి చేసిన వారిని శిక్షించాలి

ఇల్లంతకుంట: మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణంలో దళిత యువకులు దొంతతనం చేశారనే నెపంతో చిత్రవధ చేస్తూ తీవ్రంగా కొట్టిన వ్యక్తులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షుడు పసుల వెంకటి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దళిత యువకులైన తేజ, కిరణ్ లు చాకలి రాములుకు చెందిన మేకను దొంగిలించారనే నెపంతో తలకిందులుగా వేలాడదీసి కింద మంట పెట్టి చిత్రవధ చేస్తూ నరకం చూపించారని, ప్రభుత్వం, పోలీసులు స్పందించి చాకలి రాములుపై కేసు నమోదు చేయాలన్నారు.

పేద స్వర్ణకారులను ఆదుకోవాలి

ముస్తాబాద్: పేద స్వర్ణకారుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని స్వర్ణకారుల సంఘం మండల అధ్యక్షుడు చింతోజు బాలయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సమాజంలో పలు సామాజిక వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తున్నారని, అలాగే స్వర్ణకారులకు స్వర్ణకారుల బంధు అమలు చేయాలన్నారు. ఎలాంటి సబ్సిడీలు, పథకాలు స్వర్ణకారుల కోసం ప్రభుత్వం అమలు చేయడం లేదన్నారు. అలాగే అర్హులైన స్వర్ణకారులకు డబుల్ బెడ్రూం ఇళ్లు, ఆసరా పింఛన్లు మంజూరు చేయాలని కోరారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

ఎల్లారెడ్డిపేట: మండలంలోని అల్మాస్‌పూర్‌లో లబ్ధిదారులకు మంజూరైన రూ.1.50 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎంపీపీ పిల్లి రేణుక ఆదివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రాధారపు పుష్పల, గ్రామశాఖ అధ్యక్షుడు గురజాల కమాలాకర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

అన్నదానం

వేములవాడ: పేదల ఆకలిని తీర్చేందుకు వర్షంలోను సైతం వేములవాడ ట్రస్టు 150 మందికి అన్నదాన పొట్లాలు పంపిణీ చేశారు. 856 రోజులుగా అన్నదానం నిర్వహిస్తునట్లు నిర్వాహకులు మధు మహేశ్, పొలాస రాజేందర్ తెలిపారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి



ఎస్సై రమాకాంత్

ఎల్లారెడ్డిపేట: సిరిసిల్ల కోర్టులో ఈనెల 9 వరకు నిర్వహించే లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎస్సై రమాకాంత్ కోరారు. ఎల్లారెడ్డిపేటలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. రాజీ చేసుకునే అవకాశం ఉంది కాబట్టి ప్రమాదాలు, చీటింగ్, వివాహ సంబంధిత, దొంగతనం కేసుల్లో రాజీ చేసుకోవచ్చని తెలిపారు. డ్రంకెన్‌డ్రైవ్ కేసులను లోక్‌అదాలత్‌లో పరిష్కరించుకోవాలని సూచించారు. కేసుల వివరాలకు ఎస్సైని, కోర్టు కానిస్టేబుల్‌ను సంప్రదించాలని సూచించారు.

ఖమ్మం జిల్లా పంచాయతీ వెల్ఫేర్ అధికారికి సన్మానం



సుమాచౌదరిని సన్మానిస్తున్న రమేశ్

ఎల్లారెడ్డిపేట: ఖమ్మం జిల్లాలో జిల్లా పంచాయతీ వెల్ఫేర్ అధికారిగా పనిచేస్తున్న సుమాచౌదరిని మాజీ ఏఎంసీ చైర్మన్ కొండ రమేశ్ దంపతులు ఆదివారం సన్మానించారు. గతంలో ఎల్లారెడ్డిపేట తహసీల్దార్‌గా పనిచేసిన సుమాచౌదరి ఇటీవల ఆర్డీవోగా పదోన్నతి పొంది ఖమ్మం జిల్లా పంచాయతీ వెల్ఫేర్ అధికారిగా నియమితులయ్యారు. బాధ్యతలు చేపట్టిన ఆమె తొలిసారిగా గొల్లపల్లి రావడంతో రమేశ్ దంపతులు సన్మానించారు.